# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

- నిర్మాణాత్మక సంస్కరణలకు ఊతమిస్తూ.. ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడమే లక్ష్యగా బడ్జెట్ రూపొందించినట్లు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

- బడ్జెట్ 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు ప్రశంసించారు.

- భారతీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ ఖ్యాతిని తిరిగి తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

- రానున్న 24 గంటల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

=======================

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ఈరోజు ప్రవేశపెట్టారు. ఆర్థిక మంత్రిగా ఆమెకు ఇది వరుసగా తొమ్మిదో బడ్జెట్ కావడం విశేషం. ఈ బడ్జెట్‌ను యువశక్తి ఆధారిత బడ్జెట్‌గా అభివర్ణించిన మంత్రి.. దేశాభివృద్ధిని పరుగులు పెట్టించేలా దీనిని రూపొందించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 7 హైస్పీడ్ రైలు కారిడార్లను అభివృద్ధి చేయనున్నామని, భారత్‌ను ప్రపంచ బయోఫార్మా హబ్‌గా మార్చేందుకు 10 వేల కోట్ల రూపాయలతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీకి నిధులను 40 వేల కోట్ల రూపాయలకు పెంచామని, మైనింగ్, పరిశోధనల కోసం 3 ప్రత్యేక కెమికల్ పార్కులను ఏర్పాటు చేస్తామని, మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో నేషనల్ ఫైబర్ స్కీమ్, చేనేత-హస్తకళల అభివృద్ధి కోసం సమీకృత కార్యక్రమాలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎస్ఎంఈ (SME) రంగాన్ని ప్రోత్సహించడానికి 10 వేల కోట్ల రూపాయలతో "ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్"ను తీసుకువచ్చామని, నగరాల అభివృద్ధి కోసం ప్రభుత్వ మూలధన వ్యయాన్ని 12.2 లక్షల కోట్ల రూపాయలకు పెంచామని తెలిపారు. బ్యాంకింగ్

రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు “వికసిత్ భారత్ బ్యాంకింగ్ కమిటీ”ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, మూడు కొత్త ఆయుర్వేద సంస్థలు (AIA), ఆయుష్ ఫార్మసీల ఆధునీకరణకు నిధులు కేటాయించామని నిర్మలా సీతారామన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌ను చారిత్రకంగా అభివర్ణించిన ఆయన.. 2047 నాటికి `వికసిత్ భారత్` లక్ష్యాన్ని చేరుకునేందుకు బలమైన పునాది వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్జెట్ అనంతరం ప్రధానమంత్రి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశాభివృద్ధిలో ఈ బడ్జెట్ కీలక మైలురాయి అని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని, భారత్ చేపట్టిన సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌కు ఇది సరికొత్త శక్తిని, వేగాన్ని ఇస్తుందని నరేంద్ర మోదీ ప్రశంసిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026-27పై కేంద్ర కేబినెట్ మంత్రులు ప్రశంసలు కురిపించారు. ప్రతి రంగం, ప్రతి పౌరుడునీ సాధికారత వైపు నడిపించేలా ఈ బడ్జెట్ ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్‌ను నిలబెట్టేందుకు ఇది దిశానిర్దేశం చేస్తుందన్నారు. గ్రామాలు, పేదలు, రైతుల తలరాతను మార్చేలా బడ్జెట్ ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాల కోసం ఏకంగా లక్షా 62 వేల 671 కోట్ల రూపాయలు కేటాయించి రైతన్నను ఆదుకున్నారన్నారు. కనెక్టివిటీ, ప్రాంతీయ సమతుల్యతపై బడ్జెట్ ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి అధిక ప్రాధాన్యత లభించిందని, వికసిత్ భారత్ నిర్మాణానికి ఇది బలమైన పునాది అని రైల్వే, ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. తయారీ రంగం అభివృద్ధే లక్ష్యంగా ఈ బడ్జెట్ సాగిందని కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడంతో పాటు.. “ఖేలో ఇండియా” ద్వారా క్రీడా వ్యవస్థను పటిష్టం చేసేలా బడ్జెట్ ఉందని కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ సరిహద్దుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. కేంద్ర బడ్జెట్ 2026-27లో రక్షణ మంత్రిత్వ శాఖకు 7.85 లక్షల కోట్ల రూపాయలను కేటాయించింది. అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలతో పోలిస్తే ఇదే అత్యధికం కావడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఇది 15.19 శాతం వృద్ధిని నమోదు చేసింది. రక్షణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈ కేటాయింపులు వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా జీడీపీలో 2 శాతానికి సమానం.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్ 2026-27 దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఉందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కొనియాడారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భారత్‌ను “ఆత్మనిర్భర్”, “వికసిత్ భారత్”గా మార్చే ప్రక్రియకు ఈ బడ్జెట్ ఒక బలమైన పునాది వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో

రక్షణ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి రక్షణ శాఖకు కేటాయింపులను 15 శాతానికి పైగా పెంచినట్లు ఆయన వెల్లడించారు. ఈ అదనపు నిధులు సైనిక ఆధునికీకరణకు, స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఎంతగానో తోడ్పడతాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిటిష్ పాలనకు పూర్వం భారతీయ ఉత్పత్తులకు ఉన్న అంతర్జాతీయ ఖ్యాతిని తిరిగి తీసుకురావాలని, ఆ దిశగా నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. జలంధర్‌లోని డెరా సచ్‌ఖండ్ బల్లన్ వద్ద జరిగిన సభలో ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. అంతకుముందు, సంత్ గురు రవిదాస్ జీ 649వ ప్రకాష్ పూర్వ్ పురస్కరించుకుని నరేంద్ర మోదీ డెరా సచ్‌ఖండ్ బల్లన్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదంపూర్ విమానాశ్రయానికి 'శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ విమానాశ్రయం, ఆదంపూర్'గా కొత్త పేరును ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

నిర్మాణాత్మక సంస్కరణలకు ఊతమిస్తూ.. ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడమే లక్ష్యగా బడ్జెట్ రూపొందించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బడ్జెట్ అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఈసారి బడ్జెట్‌లో 12.2 లక్షల కోట్ల రూపాయలను మూలధన వ్యయం కోసం కేటాయించామని, ఇది జీడీపీలో 4.4 శాతమని, గత పదేళ్లలో ఇదే అత్యధిక కేటాయింపు అని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4.4 శాతంగా ఉన్న ద్రవ్యలోటును, 2026-27 నాటికి 4.3 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. ఉత్పాదకతను పెంచడం, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడమే ఈ బడ్జెట్ ప్రధాన ఉద్దేశమని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్ 2026–27 ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు దాదాపు 2 శాతం వరకు క్షీణించాయి. అధిక రుణ అవసరాలు, ఫ్యూచర్స్–ఆప్షన్స్ ట్రేడ్లపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ పెంపు వలన మార్కెట్ వర్గాల్లో ఆందోళన వ్యక్తమైంది. సెన్సెక్స్ 1,547 పాయింట్లు పతనమై 80 వేల 723 వద్ద స్థిరపడగా... నిఫ్టీ 495 పాయింట్లు నష్టపోయి 24 వేల 825 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 24 గంటల్లో పలు రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కమ్మే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ఈరోజు రాత్రి నుంచి అస్సాం, మేఘాలయ, బీహార్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలతో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లోని హిమాలయ ప్రాంతాలు, సిక్కిం, పశ్చిమ రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలోనూ ఇదే తరహా పరిస్థితులు ఉంటాయని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్-19 ప్రపంచ కప్-2026 లో భారత్ సెమీస్‌కు చేరుకుంది. సూపర్ సిక్సెస్‌లో పాకిస్థాన్‌తో బులవాయో వేదికగా జరుగుతున్న వన్డే క్రికెట్ మ్యాచ్‌లో ఫలితం తేలాల్సి ఉన్నా.. మెరుగైన నెట్ రన్‌రేట్‌తో భారత్ ముందంజ వేసింది. భారత్ నిర్దేశించిన 253 పరుగుల లక్ష్యాన్ని పాకిస్థాన్ 33.3 ఓవర్లలోపు ఛేదిస్తే ఆ జట్టు భారత నెట్

రన్‌రేట్‌ను అధిగమించి సెమీ ఫైనల్‌కు చేరేది. కానీ, లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 33.3 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 167 పరుగులే చేసింది.

=======================

=======================